

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 03.08.2025 | సంపుటి : 2 | సంచిక :181 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Sunday | 03.08.2025 | volume : 2 | Issue : 181 | Pages : 8 | Cost : 2/- |


## భారత్‌ది డెడ్ ఎకానమీయా..?

# డైనమిక్

భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి..

ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది'

ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా సమాధానమిచ్చిన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లు

న్యూయార్క్, ఆగస్ట్ 2 :

ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ- వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెబుతున్నాయి. తాజాగా ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలపై ఇవి నిర్మొహమాటంగా ట్రంప్ చెంప ఛెల్లుమనేలా సమాధానం ఇచ్చాయి.భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు ట్రంప్ మూర్ఖత్వాన్ని తెలియచేశాయి. భారత్‌ది డెడ్ ఎకానమియా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది. భారత్‌ది డెడ్ ఎకానమి కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని గ్రోక్ వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' జెమిని తెలిపింది.




06



ప్రపంచంతో పోటీ పడాలనే

# స్పోర్ట్స్ పాలసీ

- క్రీడల్లో తెలంగాణ యువత రాణించాలి
- చదువుతో పాటు ఆటల్లోనూ మేటి కావాలి
- యువత పెడదోవపట్టకుండా క్రీడల్లో ప్రోత్సాహం
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నా మని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతు న్నారని, క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు

02


## మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

- ఇతర దేశాలపై ఆధారపడకుండా సాగాలి
- ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలు..
- ప్రధాని నరేంద్రమోదీ స్ట్రాంగ్ కౌంటర్

భారత్ కూడా అతి త్వ రలోనే మూడో అతి పెద్ద ఆర్థిక శక్తిగా మారనుం దని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉ త్పత్తులను పెంచాలంటూ పిలుపు నిచ్చారు.



04



## దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి

- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- రాహుల్‌ను ప్రధానిని చేయాలని తెలంగాణ పక్షాన హామీ
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

03



## లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

- బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం పని
- దానికి ఆధారాలు మా వద్ద ఉన్నాయి : రాహుల్
- అధికారంలోకి వచ్చాక బాధ్యులను వదలం : హెచ్చరిక

03




03

## కాళేశ్వరం కేసులో కేసీఆర్ పక్కా దోషి

- కమిషన్ విచారణలో అదే తేలింది
- సొంత లాభం కోసం లక్షకోట్లు వృథా చేసిన కేసీఆర్
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్

సంగారెడ్డి, ఆగస్ట్ 2 :

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

## పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు



- ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ

03

## బనకచర్లపై లోకేశ్‌వి అవగాహన లేని మాటలు

- మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తెలుస్తారు
- కెటిఆర్‌తో రహస్య భేటీ తరువాతనే తెరపైకి బనకచర్ల
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు

బనకచర్లపై లోకేశ్ తదితర మంత్రుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అసలు జలాలకే మోక్షం లేదంటే ఇక మిగులు జలాలు ఎక్కడివని అన్నారు. తెలంగాణ వినియోగించుకోగా వచ్చిన నీళ్ల వాడుకుంటామని అంటున్నారని, అది ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోతున్నారని అంటూ..ముందు దాని సంగతి చూడాలన్నారు. ఎపి మంత్రులు బనకచర్ల విషయంలో చేస్తున్న ప్రకటనలు వాస్తవ విరుద్ధమన్నారు.



02



02

## సమగ్ర పాలసీతోనే చెరువులు, కుంటల అభివృద్ధి

- రైతు కమిషన్ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- చెరువులు, కుంటల పరిరక్షణపై చర్చించిన కమిషన్

## బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ డ్రామాలు

- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలని బీజేపీ డిమాండ్
- కామారెడ్డి డిక్లరేషన్ ఎక్కడ?
- ముస్లిం రిజర్వేషన్లతో బీసీల హక్కులకు గండి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



02



## తక్కువ శిక్ష వేయండి.. ప్లీజ్

- కోర్టులో బిగ్గరగా ఏడ్చేసిన ప్రజ్వల్ రేవణ్ణ
- జీవిత ఖైదు ఖరారు చేసిన న్యాయస్థానం

06

## సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ

- కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు
- నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ భవనాలు
- గచ్చిబౌలిలో భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



03

# బీసీ రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ డ్రామాలు

- 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి చూపాలని బీజేపీ డిమాండ్
- కామారెడ్డి డిక్లరేషన్ ఎక్కడ?
- ముస్లిం రిజర్వేషన్లతో బీసీల హక్కులకు గండి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఇందిరా పార్క్ వద్ద బీజేపీ ధర్నా
- బీసీలకు పూర్తి న్యాయం కావాలని డిమాండ్



**హైదరాబాద్, ఆగస్ట్ 2 :** బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతోందని, ముస్లింల రిజర్వేషన్లతో బీసీల హక్కులను హరించేందుకు కుట్రలు చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన బీజేపీ ధర్నాలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లు గడుస్తున్నా, కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఇంకా అమలు చేయలేదు," అని పేర్కొన్నారు. "కేవలం కేంద్రం, బీజేపీలపై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి," అని మండిపడ్డారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, "తెలంగాణలో ఒకప్పుడు 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. కానీ ఇప్పుడు ముస్లిం రిజర్వేషన్ల పేరిట బీసీల వాటా తగ్గించబడింది. బీసీలకు న్యాయం చేయాల్సిన కాంగ్రెస్ పార్టీ, వారి హక్కులను హరిస్తోంది. అసలు బీసీలకు ఎన్ని పదవులు ఇచ్చారు? రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు ఎంత ప్రాధాన్యత ఉంది?" అని ప్రశ్నించారు.

## బీసీలకు పూర్తిస్థాయి రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్

కేంద్ర మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పటికీ ఆ హామీ అమలు చేయలేదు. మోసం చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు గమనిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు గల్లంతు కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు," అన్నారు. "కమిషన్ ఏర్పాటు చేసినట్టు ప్రకటించినా, దాని నివేదికకు చట్టబద్ధత ఉందా? తమిళనాడు మాదిరి 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రయత్నం అయినా జరిగిందా?" అని ప్రశ్నించారు. బీసీల హక్కుల కోసం పోరాడాలని అన్ని బీసీ సంఘాలకు పిలుపు ఇచ్చారు.

## రాహుల్ గాంధీపై విమర్శలు

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, రామచందర్ రావులు మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ దేశ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీలకు సంబంధించి కాంగ్రెస్ చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అవకాశాలు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి. ఒకేసారి తొమ్మిది కార్పొరేషన్ ఛైర్మన్లు నియమించగలిగిన కాంగ్రెస్, బీసీలకు ఒక్క పదవిని మాత్రమే ఇచ్చింది," అని మండిపడ్డారు. "గత 70 ఏళ్లలో బీసీ జనాభా గణన ఎందుకు చేయలేకపోయారు?" అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. "ఆర్టికల్ 340 ప్రకారం ముందుకు వెళ్తామంటే, చట్టబద్ధమైన ప్రణాళిక ఉండాలి. కానీ కాంగ్రెస్‌కు అలాంటి స్పష్టత లేదు," అన్నారు. "ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చి బీసీల కోటాకు గండి కొడుతున్నారు. ఇది పూర్తిగా అన్యాయం. బీసీలకు న్యాయం చేసిన పార్టీ బీజేపీ మాత్రమే," అని స్పష్టం చేశారు. బీసీల హక్కుల కోసం అన్ని వర్గాలు పోరాడాలని పిలుపునిస్తూ, రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. "బీసీ హక్కులకు మద్ధతుగా బీజేపీ అడ్డుగా నిలబడుతుంది," అని కిషన్ రెడ్డి తెలిపారు.




# ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీ

- క్రీడల్లో తెలంగాణ యువత రాణించాలి
- చదువుతో పాటు ఆటల్లోనూ మేటి కావాలి
- యువత పెడదోవపట్టకుండా క్రీడల్లో ప్రోత్సాహం
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 2 :** ప్రపంచంతో పోటీ పడాలనే స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుల్లోనే కాదు.. క్రీడల్లోనూ యువత రాణించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా విధానం లేకపోవడం వల్ల పట్టణ ప్రాంతాల్లోని యువత పెడదోవ పడుతు న్నారని, క్రీడలను ప్రోత్సహించక పోవడం వల్లే యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. శనివారం హెచ్‌ఐసీసీలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌లో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ'ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలో నూతన విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంతో పోటీపడే మనం.. క్రీడల్లో వెనకబడి ఉండడం బాగాలేదన్నారు. భారత్‌కు బలమైన క్రీడా వేదిక కావాలని.. అందులో తెలంగాణ ప్రధానంగా ఉండాలని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నామని.. యువతకు దశ దిశా లేకపోవడం బాధాకరమని అన్నారు. వ్యసనాల రూపంలో మనవైపు వేగంగా ప్రమాదం దూసుకొస్తుందని అన్నారు. ఓ విధానం లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని.. అందుకే నూతన క్రీడావిధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు. క్రీడల్లో రాజకీయ జోక్యం ఉండకూడదని భావిస్తున్నామని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పై స్పోర్ట్స్ చాప్టర్ పెడతామని అన్నారు. 1956లో ఫుట్ బాల్ టీంలో మనవాళ్ళు 9 మంది ఉండేవారని.. క్రీడల్లో హైదరాబాద్ కు మంచి పేరు ఉండేదని అన్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో రాణించినవారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. చదువుల్లోనే కాదు, క్రీడల్లోనూ రాణిస్తే ఉద్యోగం ఇస్తామని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడా నైపుణ్యానికి కొదవ లేదని అన్నారు. ఇప్పుడు స్టేడియంలు ఫంక్షన్ హాల్స్ గా మారాయని అన్నారు. ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ కూడా రాకపోవడం సిగ్గు అనిపిస్తోందని అన్నారు. మనకంటే చాలా చిన్న దేశాలు క్రీడల్లో రాణిస్తున్నాయని అన్నారు. ఇటీ-వల సౌత్ కొరియాను సందర్శించామని.. అక్కడ స్పోర్ట్స్ వర్సిటీలో చదివినోళ్లే గోల్డ్ మెడల్స్ కొట్టారని అన్నారు. చైతన్యానికి పోరాటానికి మారుపేరైన తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి పోరాటం చేసిన యువత నేడు దశ దిశా లేకుండా.. ప్రభుత్వాలకు సరైన విధానాలు లేకపోవడం వల్ల వ్యసనాల వైపు వేగంగా ప్రయాణిస్తున్నారని అన్నారు. పోరాట స్ఫూర్తి, చైతన్యం ఉన్న ఈ ప్రాంతం క్రీడల్లో రాణించాలని, దేశానికి గొప్ప పేరు తేవాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రానికి క్రీడావిధానం ఉండాలని, క్రీడా విధానంలో రాజకీయ జోక్యం తగ్గించాలని, క్రీడాకారుల స్ఫూర్తిని పెంచాలని పబ్లిక్ ప్రైవేట్ ప్కార్టర్ షిప్ తో నూతన క్రీడా విధానాన్ని తీసుకొస్తున్నామని అన్నారు.



# పుష్కలంగా నీరున్నా.. నిర్వహణ లేదు

- అందుకే రాష్ట్రాల మధ్య జల వివాదాలు
- ఏటా వృథాగా పోతున్న వేల టీఎంసీల గోదావరి నీరు
- పోర్టులు, రోడ్లతోనే దేశం వేగంగా అభివృద్ధి
- రూ.5,233 కోట్ల రహదారులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- మంగళగిరి వేదికగా పలు కార్యక్రమాలకు గడ్కరీ శ్రీకారం

**అమరావతి, ఆగస్ట్ 2 :** మనదేశంలో నీటి కొరత సమస్య లేదు.. నీటి నిర్వహణే పెద్ద సమస్య అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అందుకే రాష్ట్రాలమధ్య వివాదాలు వస్తున్నాయి. మనదేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం. అది 22 శాతానికి పెరగాలనేది మా లక్ష్యం అని గడ్కరీ అన్నారు. ఏటా వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో వృథాగా కలుస్తోంది. దేశ ప్రగతిలో నీరు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఏపీ అభివృద్ధిలో నౌకాయాన శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తొలుత సభకు వచ్చిన అందరికీ తెలుగులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నమస్కారం చెప్పారు. మంగళగిరి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని రూ.5,233 కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షిప్పింగ్, పోర్టులు, రోడ్లు అభివృద్ధి చెందితే ఆ దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఏపీ అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోంది. మంచి నాయకుడు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ గురించి ఎప్పుడూ వినేవాళ్లం. ఆయన లాంటి విజన్ ఉన్న నాయకుడు అరుదుగా ఉంటారు. ఆయన ఎప్పుడూ భవిష్యత్ గురించే ఆలోచిస్తారని అన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నాం. కొద్దికాలంలోనే జపాన్‌ను అధిగమించాం. ఒకటి, రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయి. మోదీ హయాంలో మన రైతులు విద్యుత్ తయారు చేస్తున్నారు. ఇథనాల్ వల్ల దేశంలో రూ.లక్షల కోట్లు ఆదా అవుతాయన్నారు. భవిష్యత్‌లో విమానాలు కూడా రైతులు తయారు చేసే ఇంధనంతోనే నడుస్తాయి. ఇథనాల్, మిథనాల్, సీఎన్‌జీ, బయో డీజిల్ వినియోగం వేగంగా పెరుగుతోంది. ఈవీ వాహనాల తయారీ శరవేగంగా పెరుగుతోంది. లిథియం బ్యాటరీల ఖర్చు క్రమంగా తగ్గుతోంది. వంద శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలు రావాలి. కాలుష్య రహిత దేశమే మన లక్ష్యం కావాలని అన్నారు ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తాం. నాగ్‌పుర్, జబల్‌పుర్‌లో వరిగడ్డి వినియోగించి రోడ్లు వేశాం అన్నారు. అమెరికాలో ఉన్న రోడ్ల వల్లనే అమెరికా రిచ్ అయిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైపు వెళ్తోందన్నారు.. చంద్రబాబు విజన్ ఉన్న నేత.. ఎప్పటికీ ఆదర్శంగా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ లో షిప్పింగ్ వల్ల ఎంతో అభివృద్ధి చెందుతోంది.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఏపీని అభివృద్ధి చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని కేంద్ర మంత్రి వెల్లడించారు. చంద్రబాబు తను సీఎంగా దేశానికి విజన్ చూపారని.. భవిష్యత్తు పై అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. నాలెడ్జిని వెల్త్ గా మార్చేదే విజన్ అని.. చంద్రబాబు డెవలెప్మెంట్ విజన్ పట్ల ఆయనను అభినందించాల న్నారు. నేను షిప్పింగ్ మంత్రిగా ఉన్నప్పుడు తన వద్ద రూ. 9వేల కోట్లు బడ్జెట్ ఉంటే రూ.12 లక్షల కోట్లు- పనులు చేశామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. యాక్సిడెంట్ విషయంలో చాలా ముందు ఉంది. ప్రతి జిల్లాలో వాటిని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని నితిన్ గడ్కరి వ్యాఖ్యానించారు.

# బనకచర్లపై లోకేశ్‌వి అవగాహన లేని మాటలు

- మిగులు జలాల గురించి అప్పుడే ఎలా తేలుస్తారు
- కెటిఆర్‌తో రహస్య భేటీ తరువాతనే తెరపైకి బనకచర్ల
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సంచలన వ్యాఖ్యలు



**కొల్లాపూర్, ఆగస్ట్ 2 :** బనకచర్లపై లోకేశ్ తదితర మంత్రుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అసలు జలాలకే మోక్షం లేదంటే ఇక మిగులు జలాలు ఎక్కడివని అన్నారు. తెలంగాణ వినియోగించుకోగా వచ్చిన నీళ్లు వాడుకుంటామని అంటున్నారని, అది ఇప్పట్లో సాధ్యం కాదన్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టును పూర్తి చేయలేక పోతున్నారని అంటూ..ముందు దాని సంగతి చూడాలన్నారు. ఎపి మంత్రులు బనకచర్ల విషయంలో చేస్తున్న ప్రకటనలు వాస్తవ విరుద్ధమన్నారు, ఇకపోతే కెటిఆర్ లోకేశ్ కలిసిన తరవాతనే లోకేశ్ బనకచర్ల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఈ ఇద్దరి మధ్య చీకట్లో ఏ ఒప్పందం కుదరిందో చెప్పాన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్ ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ- సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు- చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కృష్ణా నదిపై గత ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు న్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదన్నారు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగిందన్నారు. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. మిగులు జలాలు ఉంటేకదా బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరఫున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నామని డిప్యూటి సిఎం అన్నారు.

# శ్రీశైలం వద్ద తగ్గుతున్న వరద ప్రవాహం

**నంద్యాల, ఆగస్ట్ 2 :** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. మరోవైపు సాగర్ వద్ద కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. శ్రీశైలం వద్ద నీరు తగ్గడంతో ఒక గేటు మూసివేసి.. ఏడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 2,74,254 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ఇక్కడి నుంచి ఔట్ ఫ్లో 2,73,632 క్యూసెక్కులుగా ఉంది. 7 స్పిల్ వే గేట్ల ద్వారా 1,87,530 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 20,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,787 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 882.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 200.19 టీఎంసీలుగా నమోదైంది.

# అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు

- రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ
- సన్నబియ్యంతో ఖజానాపై రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారం
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో వెనక్కి తగ్గేది లేదు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



**పెద్దపల్లి, ఆగస్ట్ 2 :** మంథని నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ఐటీ, మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నాంది పలికింది. ప్రతి అర్హ కుటుంబం సకాలంలో సన్న బియ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సన్న బియ్యం సరఫరా సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల సుమారు రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. 'ఉచిత బస్ ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లను ఉపయోగించుకున్నారని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతీ నెల రూ. 6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నప్పటికీ, సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు- చేయనున్నట్లు- తెలిపారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు- చెప్పారు. అదనంగా, 10,200 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేసినట్లు- పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి. మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా కృతనిశ్చయం అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు. ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మీపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించ లేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు- ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.



# సమగ్ర పాలసీతోనే చెరువులు, కుంటల అభివృద్ధి

- రైతు కమిషన్ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- చెరువులు, కుంటల పరిరక్షణపై చర్చించిన కమిషన్

**హైదరాబాద్, ఆగస్ట్ 2 :** రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ- అయ్యింది. ఈ భేటీ-లో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి వున్నారు. ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతో పాటు- రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీ-లను ఏర్పాటు- చేయాలనీ చెప్పింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించింది. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లేఔట్లు- వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని వివరించింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ తెలిపింది. ఆ పాలసీని కమిషన్ తయారు చేయనున్నట్లు- వివరించింది. నిపుణులతో పాలసీ కి సంబంధించి ప్రసెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు- చేయనున్నట్లు-.. ఆ సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకావాలని కమిషన్ కోరింది. కమిషన్ ఆహ్వానం కు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించినట్లు- కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి

- సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
- దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
- పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
- రాహుల్‌ను ప్రధానిని చేయాలి : తెలంగాణ పక్షాన విన్నపం
- 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
- మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కే సాధ్యం
- కాంగ్రెస్ న్యాయ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 :** దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ మాత్రమే," అని ఆయన చెప్పారు. "భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ వంటి పార్టీలూ స్వాతంత్ర్యం తర్వాత ఏర్పడినవి," అని ఆయన వివరించారు. "ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. అయితే, కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల మధ్యే ఉన్న ఒకే ఒక పార్టీ," అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆయన ఆలోచించలేదని చెప్పారు. "వక్రమార్గంలో ఉన్న నేతలను, రెండు చెంపదెబ్బలు కొట్టి కూడా, దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోంది," అని అన్నారు.

### దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్

"మా పార్టీ దేశానికి ఏం చేసిందో విమర్శిస్తున్నారు. కానీ, 140 ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కృషి ప్రారంభించింది. ఆంగ్లేయులను ఓడించి స్వాతంత్ర్యం సాధించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ "యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు, కానీ ఆమె ప్రధాని పదవిని త్యాగం చేశారు. 2004లో రాహుల్ గాంధీ కేంద్ర మంత్రి అయ్యారు. ఆయన కోరుకున్నా, 2009లో ప్రధాని అయ్యేవారు. కానీ, సీనియర్ నేతలకు పదవులు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్ గాంధీ పని చేశారు. ఆయన 25 సంవత్సరాలుగా సామాజిక న్యాయానికి పోరాడుతున్నారు."

### 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ

"మరోవైపు, నరేంద్ర మోదీ 25 సంవత్సరాలుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయినప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంసిద్ధంగా మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది, కానీ ఆయన రాజీ పడలేదు. మోహన్ భగవత్ 75 ఏళ్ల వయస్సు దాటిన వారికి కుర్చీ వదిలేయాలని సూచించినా, మోదీ దానికి సిద్ధంగా లేరు.""ఈ నిబంధనతో ఇప్పటికే అద్వాణీ, మనోహర్ జోషి వంటి వారిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు వాజ్‌పేయీ ప్రయత్నించారు, ప్రధాని పదవి నుంచి మోహన్ భగవత్ ప్రయత్నించారు. కానీ మోదీని కొందరు తప్పించలేకపోయారు." "వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాటం విజయవంతం కావాలని నేను నమ్ముతున్నాను," అన్నారు రేవంత్ రెడ్డి. "దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసిన పార్టీ కాంగ్రెస్, మేమే అని నేను గర్వంగా చెబుతున్నాను." "ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడం లేదని, ప్రజలకు మార్గదర్శనం ఇచ్చే సదస్సు నిర్వహించడం గొప్ప విషయం," అన్నారు. "సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆత్మనిర్ణయం చేస్తూనే ఉంటామని చెప్పారు." "తెలంగాణ ప్రజల పక్షాన, రాహుల్ గాంధీని భారత ప్రధాని చేసి తీరుతామని, ఆయన గతంలో భారత్‌కు ప్రధాని అయ్యే అవకాశాన్ని వదులుకున్నా, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని నేను భావిస్తున్నాను." "మోడీని ప్రధాని పదవిలోనుంచి కింద పెట్టడం కేవలం రాహుల్ గాంధీకి మాత్రమే సాధ్యమని, మోడీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని చెప్పారు." "మాది ఎప్పటికీ ప్రజల పక్షమే," అన్నారు. "ఇందిరాగాంధీ రెండు ముక్కలుగా పాకిస్థాన్‌ను విభజించారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ" అని ఆయన కొనియాడారు.




# కాళేశ్వరం కేసులో కేసీఆర్ పక్కా దోషి

- కమిషన్ విచారణలో అదే తేలింది
- సొంత లాభం కోసం లక్షకోట్లు వృధా చేసిన కెసిఆర్
- అందుకు మూల్యం చెల్లించక తప్పదు: పిసిసి చీఫ్

**సంగారెడ్డి, ఆగస్ట్ 2 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ సొంత లాభం మాత్రమే చూసుకున్నారని తెలిపారు. కెసిఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజక వర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని తెలియజేశారు. కాంగ్రెస్‌లో గ్రూపులు సహజం.. పార్టీలో గ్రూపులు ఉండాలని, ఎన్నికల సమయానికి అందరూ పార్టీ కోసం పోరాడాలని సూచించారు. గ్రూపుల వల్ల నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత తమది అని హామీ ఇచ్చారు. కెసిఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, బిఆర్ఎస్ చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్టుకు ఏపి ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. తమ ఫిర్యాదు వల్లే బనకచర్ల ప్రాజెక్టు పనులు ఆగాయని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## తుది దశలో విత్తన చట్టం ముసాయిదా

**హైదరాబాద్:** రాష్ట్రంలో విత్తన చట్టం ముసాయిదా రూపకల్పన తుది దశకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ దీని తయారీపై కసరత్తును వేగవంతం చేసింది. నకిలీ విత్తనాలు, పురుగు మందులతో రైతులు మోసపోతే.. విత్తన కంపెనీల నుంచి నష్టపరిహారం ఇప్పిం చడం వంటి అంశాలతో ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలిసిం ది. పంట సీజన్ ముగిశాక నష్టాన్ని గుర్తిస్తే 100% పరిహా రం, పంటకాలం మధ్యలో నష్టం వాటిల్లినట్లు తేలితే 50%, విత్తనాలు వేసిన మొదట్లో అయితే 10 నుంచి 20% పరిహా రం ఇవ్వాలని సిఫార్సులు రూపొందిస్తున్నట్లు సమాచారం.

## కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తారు : జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్:** కాళేశ్వరం విచారణలో కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకొస్తారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ ప్రతి క్షణం తెలంగాణ కోసమే పరితపించారు. ఆయనకు వ్యతిరేకంగా ఏ కమిషన్ ఎలాంటి నివేదికలు ఇవ్వలేవు. నాలుగేళ్లలోనే కాళేశ్వరం లాంటి అతిపెద్ద ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి రైతులకు అంకితమిచ్చారు. కేంద్రం నిధులు ఇచ్చినా ఏపీలో పోలవరం పనులు పూర్తి చేయలేకపోయారు. ఆ ప్రాజెక్టు ఇప్పటికే మూడుసార్లు కొట్టుకుపోయింది. చరిత్రలో అతిపెద్ద వరదలు రావడంతో మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే మోదీ, చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి కేసీఆర్‌పై దాడి చేస్తున్నారు' అని జగదీశ్‌రెడ్డి విమర్శించారు.


## పెండింగ్ యూజీసీ గ్రాంటును విడుదల చేయాలి : టీపీఎస్‌ఏ

**హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకుల వేతన భత్యాల చెల్లింపులకు యూజీసీ నుంచి రావాల్సిన రూ.17.13 కోట్ల పెండింగ్ గ్రాంటును వెంటనే విడుదల చేయించాలని ఐకార్ డైరెక్టర్ జనరల్ మంగీలాల్ జాట్‌ను రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టీఏఎస్ఏ) కోరింది. ఈమేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పవన్‌చంద్రారెడ్డి, సౌజన్య, ఇతర నేతలు శనివారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 450 మంది బోధన సిబ్బందికి 2016 నుంచి బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు.

## రెండోరోజుకు ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో 90 శాతం నమోదు

**హైదరాబాద్:** రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేస్తుండగా.. రెండో రోజు శనివారం 89.59 శాతం మంది డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 1,28,754 మంది టీచర్లకుగాను.. 1,15,352 మంది యాప్‌లో నమోదు చేసుకున్నట్లు సమగ్ర శిక్షాభియాన్ అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 82.61శాతం మంది కొత్త విధానంలో హాజరు నమోదు చేశారు.

## రేపటి నుంచి సీపీగెట్



**హైదరాబాద్:** రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ తదితర సీట్ల భర్తీకి నిర్వహించే సీపీగెట్ పరీక్షలు ఈ నెల 4న ప్రారంభం కానున్నాయి. మొత్తం 44 సబ్జెక్టుల పరీక్షలు ఈ నెల 11న ముగుస్తాయి. మొత్తం 63,100 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని కన్వీనర్ ఆచార్య పాండురంగారెడ్డి తెలిపారు.

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

- బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం పని
- దానికి ఆధారాలు మా వద్ద ఉన్నాయి: రాహుల్
- అధికారంలోకి వచ్చాక బాధ్యులను వదలం: హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 2 :** మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్ జరిగినట్లు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ న్యాయవేదిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఈ ఎన్నికల సంఘం న్యాయసమ్మతంగా పనిచేయకపోయిందని విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా భారీగా రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ఓ లోక్‌సభ నియోజకవర్గంపై అధ్యయనం చేసిన విషయాన్ని రాహుల్ వివరించారు. ఆ నియోజకవర్గంలో 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీగా ఉన్నట్లు చెప్పారు. "అలా ఫ్రాడ్ చేయడం వల్లే బీజేపీ అధికారం దక్కించుకుంది. ఆ 15-20 సీట్లు తక్కువగా వచ్చి ఉంటే మోదీ ప్రధాని కాలేవారు" అని పేర్కొన్నారు. "ఇండియాలో ఎన్నికల సంఘం ప్రాణం లేని వ్యవస్థగా మారిపోయింది" అని తీవ్ర విమర్శలు చేశారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ఒక్క సీటూ గెలవకపోవడం ఆశ్చర్యంగా ఉందని తెలిపారు. ఎన్నికల అవకతవకలపై మాట్లాడితే ఆధారాలు చూపించమంటారని, ఇప్పుడు తమ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయని చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నాటికే పరిస్థితుల్లో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. "అప్పుడు కోటి కొత్త ఓట్లు జతయ్యాయి, వాటిలో ఎక్కువ శాతం బీజేపీకి పడ్డాయి. ఇది ఎలాగో మేము త్వరలోనే నిరూపిస్తాం" అని రాహుల్ అన్నారు. భారత ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని విమర్శించిన రాహుల్ గాంధీ, మోదీ ఈసారి చాలా తక్కువ మెజారిటీతో గెలిచారని పేర్కొన్నారు. "ఈసీ ఓట్ల దొంగతనంలో బీజేపీకి సహకరించింది. 2014 నుంచే ఇవన్నీ జరుగుతున్నాయి. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలున్నాయి" అని తెలిపారు.

### అన్ని ఆధారాలు మా వద్ద ఉన్నాయి

"ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు మా వద్ద ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఎలా రిగ్గింగ్ జరిగిందో ప్రజల ముందుంచతాం. ఈ సత్యం బహిర్గతం చేసినప్పుడు ఎన్నికల సంఘపు స్థాయే కదిలిపోతుంది" అని హెచ్చరించారు. "ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న అధికారులు పదవీవిరమణ చేసినా వదలమని, చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని" రాహుల్ పేర్కొన్నారు. "ఈసీ బీజేపీకి అనుకూలంగా ఓట్ల దొంగతనానికి పాల్పడుతోంది. దీన్ని రుజువు చేసేందుకు మా వద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయి" అని ఆరోపించారు. ఇకపై తాము అధికారంలోకి వచ్చిన తర్వాత, బాధ్యులెవ్వరూ బయటపడకుండా పోతారని హెచ్చరించారు. ఈ ఆరోపణలపై ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. "రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవే. ఆయనలాంటి నేతల బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదు" అని ఈసీ ఖండించింది.

# పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు

- ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే
- ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు
- కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ



**హైదరాబాద్, ఆగస్ట్ 2 :** పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటు-లో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రిగారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ గారికి కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాగారికి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు లేఖలో కోరారు.

# సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ

- కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు
- నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ భవనాలు
- గచ్చిబౌలిలో భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు
- రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, ఆగస్ట్ 2 :** ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, మరో అడుగు ముందుకు వేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడంతో పాటు, కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అంశంపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా పునర్వ్యవస్థీకరణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజల సంతృప్తినే ప్రాధానంగా తీసుకొని ఈ ప్రాజెక్టును అమలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కేవలం 37 మాత్రమే స్వంత భవనాల్లో ఉన్నాయి. మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు అన్ని కార్యాలయాలను దశలవారీగా కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో నిర్మించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో నాలుగు లేదా ఐదు కార్యాలయాలను ఒకేచోట సమీకరించి ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలుగా అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్ జిల్లాలో 11 కార్యాలయాల్లో రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14 కార్యాలయాల్లో మూడు చోట్ల, మేడ్చల్ జిల్లాలో 12 కార్యాలయాల్లో మూడు చోట్ల, సంగారెడ్డి-పటాన్‌చెరువు కలిపి ఒక చోట్ల మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. అవసరమైన భూమిని గుర్తించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడుతుందని, పర్యవేక్షణ సులభమవుతుందని, అవినీతి తగ్గే అవకాశముందని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ భవనంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇది రోల్‌మోడల్ కార్యాలయంగా అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, నమూనాకు తుది రూపం ఇచ్చి, త్వరితగతిన శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.



శ్రీవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**తిరుమల, ఆగస్ట్ 2 :** కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గాయత్రి నిలయంలో బస చేశారు. ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సమేతంగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి మంత్రికి తీర్థప్రసాదాలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి దగ్గరుండి దర్శనం చేయించారు.

# సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు.. పోలీసు కస్టడీలో మరో ఇద్దరు



**హైదరాబాద్:** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఏ3.. విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కల్యాణి, ఏ6.. ధనశ్రీ సంతోషి(అస్సాం)ను కస్టడీలోకి తీసుకున్నారు. ఉత్తర మండల డీసీపీ కార్యాలయానికి వారిని తరలించారు. ఇద్దరినీ 5 రోజుల కస్టడీకి ఇటీవల సికింద్రాబాద్ సివిల్ కోర్టు అనుమతించింది. వీరిని సరోగసీ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా విచారించనున్నారు. అంతకుముందు ఈ ఇద్దరికి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో పలువురు దంపతులను మోసం చేసి డబ్బులు దండుకున్నారు. ఏజెంట్ల సాయంతో అస్సాంకు చెందిన మహిళల నుంచి పిల్లలను కొనుగోలు చేసి తీసుకొచ్చి దంపతులకు వారి బిడ్డగా అప్పగించారు. మరోవైపు నిబంధనలకు విరు ద్ధంగా వీర్యం, అండాలు సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించారు.

## సంపాదకీయం

# ఎదురుదాడితో.. అక్రమాలను దాచలేము !



ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధకారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించు కోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్, హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు.

ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసిన వారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రి వర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు.

ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొొర్రెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు. ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది.అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్‌లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది.రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే. గ్రామాల్లోకి తాగునీరు, విద్య, ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్నచర్యలు లేవు. ఇవన్నీ కూడా ఇక్కడ బిఆర్ఎస్‌కు ఎపిలో వైకాపాకు వర్తిస్తాయి.

# మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

- ఇతర దేశాలపై ఆధారపడకుండా సాగాలి
- ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలు..
- ప్రధాని నరేంద్రమోదీ స్ట్రాంగ్ కౌంటర్



**వారణాసి, ఆగస్ట్ 2 :** భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై భారత ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. "ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాల పైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. భారత్ కూడా అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుంది. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంబిగించాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలి" అని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల భారత్-రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థికవ్యవస్థలను దిగజార్చుకోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూదిల్లీపై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు. ఈనేపథ్యంలోనే మోదీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### 'సిందూర్'ను తమాషా అనడం సిగ్గుచేటు..

ఇక, ఇదే సమావేశంలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలపైనా ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. "కళ్లముందు అన్యాయం, ఉన్మాదం జరుగుతుంటే ఆ మహాదేవుడు తన రుద్రరూపాన్ని చూపిస్తాడు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత రుద్ర రూపాన్ని ప్రపంచం చూసింది. మనతో పెట్టుకుంటే పాతాళంలో కంలో ఉన్నా వదిలిపెట్టబోమని రుజువు చేశాం. కానీ, సిందూర్ విజయం కొందరికి మింగుడుపడటం లేదు. పాక్ ఉగ్ర స్థావరాల ధ్వంసమైతే కాంగ్రెస్, దాని మిత్ర పార్టీలు కన్నీళ్లు పెట్టుకుంటు న్నాయి. అందుకే మన భద్రతా దళాలను అవమానిస్తున్నాయి. అసలు ఆపరేషన్ పేరు కూడా వారికి సమస్యగా మారింది. 'సిం దూర్'ను తమాషా అని ఎవరైనా అనగలరా? అలా అనడం నిజంగా సిగ్గుచేటు" ప్రధాని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టిన 'ఆపరేషన్ మహాదేవ్' గురించి కూడా మోదీ ప్రస్తావించారు. "ఆ మహాదేవుడి ఆశీస్సులతోనే పహల్గాంకు ప్రతీకారం తీర్చుకోగలి గాం. అయితే, కొందరు ఆ ఆపరేషన్ జరిగిన సమయాన్ని కూడా అనుమానిస్తున్నారు. దానికి నేనేం చేయగలను. ఉగ్రవాదులు దొరికినప్పుడు చంపకుండా వారాలు చూసుకోవాలా? లేదంటే వారు పారిపోయేందుకు అవకాశం ఇవ్వాలా?" అని మోదీ దుయ్యబట్టారు.

# పీఎం కిసాన్ నిధుల విడుదల

## ఖాతాలో సొమ్ము జమయ్యిందా? తెలుసుకోండిలా..



**న్యూఢిల్లీ :** అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించే ఆశయంతో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న పీఎం-కిసాన్ నిధులు శనివారం జమయ్యాయి. ఈ పథకం కింద 20వ విడత నిధులను ప్రధాని మోదీ నేడు విడుదల చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఈ నిధులు విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన రూ.20వేల కోట్లతో 9.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రైతులకు ఏటా ఒక్కోవిడత రూ.2వేల చొప్పున మూడు విడతల్లో రూ.6వేల సాయం అందించే 'పీఎం కిసాన్' పథకాన్ని కేంద్రం 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించింది. ఇప్పటివరకు 11 కోట్ల మంది రైతులకు 19 వాయిదాల్లో రూ.3.46 లక్షల కోట్లు అందజేసింది.

### తెలుసుకోండిలా..

- ముందుగా పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ కి వెళ్లాలి.
- కుడి వైపున కనిపిస్తున్న ఆప్షన్లలో బెనిఫిషియరీ స్టేటస్ ఆప్షన్ ఉంటుంది.
- సెలక్ట్ చేసుకున్న తర్వాత ఖాతా నెంబరును ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసిన తర్వాత 'గెట్ డేటా' పై క్లిక్ చేయాలి.
- స్టేటస్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఒకవేళ మీరు పీఎం కిసాన్‌కు రిజిస్టర్ చేసుకొని, ఈ-కేవైసీ పూర్తిచేసి ఉంటే ఖాతాలోకి డబ్బు జమవుతుంది.
- అలాగే లబ్ధిదారుల జాబితాలో పేరు ఉందో.. లేదో.. కూడా చెక్ చేసుకోవచ్చు.
- బెనిఫిషియరీ స్టేటస్ కింద బెనిఫిషియరీ లిస్ట్ ఆప్షన్ కనిపిస్తుంది.
- ఈ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే మరొక పేజీకి రీడైరెక్ట్ అవుతుంది.
- ఇక్కడ లబ్ధిదారుడి రాష్ట్రం, జిల్లా, ఉప జిల్లా, బ్లాక్, గ్రామాలను ఎంచుకొని 'గెట్ రిపోర్ట్'పై క్లిక్ చేస్తే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది.
- పీఎం కిసాన్ హెల్ప్‌లైన్ నెంబరు 155261 / 011-24300606 కు కాల్ చేసి కూడా సమాచారం తెలుసుకోవచ్చు.

# మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్

## కేటీఆర్ పరువునష్టం కేసులో క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 2 :** మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాంపింగ్, డ్రగ్స్, టాలీవుడ్ హీరోయిన్ సమంత విడాకుల వ్యవహారంలో కొండా సురేఖ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితురాలికి నోటీసు జారీ చేయాలని స్పష్టం చేసింది. కేటీఆర్‌పైన మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేటీఆర్ తరఫున న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తర్వాత ఆదేశాలు జారీ చేసింది.నిందితురాలు

# శ్రీపోచమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములమవుదాం

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బి పి యం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ తరపున ఆలయ కమిటీకి విరాళం అందజేత
- పాల్గొన్న పలువురు కాలనీ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, బిపిఎం కాలనీ వాసులు





**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పర్వతాపూర్ అరోరా కాలేజ్ దగ్గర శ్రీ పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేయూతనందించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడిగె కృష్ణ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నగర పరిధిలోని 5వ డివిజన్ బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ తరఫున శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి తమవంతుగా రూ. 20, 116/- లు బొడిగె కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బిపిఎం కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు శ్రీ పోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 6 నుండి 10వ తేదీ వరకు పర్వతాపూర్‌లో నూతనంగా శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. అమ్మవారికి శాస్త్రోదకంగా పూజా విధానాలతో, అభిషే కాలతో, బైండ్ల పూజారులచే విగ్రహ ప్రతిష్ట చేయబడుతుందని అన్నారు. శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై విరివిగా అమ్మవారికి విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఆ అమ్మవారి దయవల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఉండే విధంగా ఆశీర్వాదం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈనెల 8, 9,10 తేదీలలో అమ్మవారికి అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని 10వ తేదీన అమ్మవారికి బోనాలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి పి యం కాలనీ అధ్యక్షులు మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రావు నాగిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవుల కృష్ణ, కోశాధికారి మునుకుంట్ల ప్రదీప్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆర్. వేణు, సుధాకర్, కమిటీ సభ్యులు ఎఫ్. రామకృష్ణ, ఎం. వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు మునుకుంట్ల సహదేవ్ గౌడ్, చిలుముల శంకర్ రెడ్డి, బద్దం అంజిరెడ్డి, వెంకటేష్ గౌడ్, దుబ్బాక జైహింద్ గౌడ్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ఆగస్టు 16 నుంచి రాష్ట్రపతి భవన్‌లో 'అమృత్ ఉద్యాన్' సందర్శన

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి భవన్‌లోని అతి సుందరమైన 'అమృత్ ఉద్యాన్'ను ప్రజల సందర్శనార్థం ఈ నెల 16 నుంచి సెప్టెంబర్ 14 వరకు ప్రవేశం కల్పిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ అధికారిక వర్గాలు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ఉద్యానవనంలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇవ్వనున్నారు. నిర్వహణ నిమిత్తం అన్ని సోమవారాలు సెలవు ఉంటుందని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉద్యానవనంలో బాలవాటిక, హెర్బల్ గార్డెన్, బోన్సాయ్ గార్డెన్, సెంట్రల్ లాన్, సర్క్యులర్ గార్డెన్, లాంగ్ గార్డెన్ వంటివి సందర్శకులను ఆకర్షించనున్నాయి. అమృత్ ఉద్యాన్‌లోని ప్రతి మొక్కకు ఉన్న క్యూఆర్ కోడ్ సహాయంతో ఆ వృక్ష జాతి గురించి తెలుకోవచ్చు. అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించాలనుకునేవారు రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. 35వ ప్రవేశద్వారం వద్దకు చేరుకున్నాక కియోస్కుల ద్వారా కూడా స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఇక ఉద్యానవనంలోకి సందర్శకులు కేవలం మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ కీలు, హ్యాండ్ బ్యాగ్స్, వాలెట్స్, నీళ్ల బాటిల్స్, పిల్లల పాలసీసాలు, గొడుగు వంటివి మాత్రమే లోపలికి తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. ఆగస్టు 29న జాతీయ క్రీడల దినోత్సవం, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడాకారులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ప్రవేశ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# నా పేరే ఓటరు జాబితాలో లేదు

## తేజస్వీ యాదవ్ కీలక ఆరోపణలు



**పట్నా:** బిహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ముసాయిదాను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత, మాజీ ఉప ముఖ్య మంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఈ ముసాయి దా జాబితాలో తన పేరే లేదని ఆరోపించారు. పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "నా ఈపీఐసీ నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సై ట్‌లో చెక్ చేశా. ఈ ముసాయిదా జాబితాలో నా పేరు కన్పించలేదు. ఇక నేను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలి? స్వయంగా బూత్ లెవల్ అధికారి నావద్దకు వచ్చి ఫామ్ తీసుకెళ్లారు. అయినా నా పేరు జాబితాలో లేదు" అని తేజస్వీ వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అనంతరం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దాదాపు 20వేల నుంచి 30వేల వరకు ఓటర్లను తొలగించాలని ఆర్జేడీ నేత ఆరోపించారు. మొత్తంగా రాష్ట్రంలో దాదాపు 65 లక్షల ఓటర్లను తొలగించారని పేర్కొన్నారు.

### తోసిపుచ్చిన ఈసీ..

అయితే, తేజస్వీయాదవ్ చేసిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం ఖండించింది. ముసాయిదా జాబితాలో ఆయన పేరు ఉందని పేర్కొంది. అందుకు సంబంధించిన కాపీని కూడా విడుదల చేసింది. ఆర్జేడీ నేత బహుశా తన పాత ఈపీఐసీ నంబరుతో చెక్ చేసుకుని ఉంటారని, అందుకే ఆయన పేరు జాబితాలో కన్పించకపోయి ఉండొచ్చని ఈసీ తెలిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తవటంతో ఈసీ ఈ ముసాయిదా జాబితాను రూపొందించింది. జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో ఓటర్ల సంఖ్య 7.93 కోట్ల నుంచి 7.28 కోట్లకు తగ్గింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు కల్పించింది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

# 100 కోట్ల వ్యయంతో
# దేవాలయ పునరాభివృద్ధి పనులు

## రాష్ట్ర దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** 100 కోట్ల వ్యయంతో దేవాలయ పునరాభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ తెలిపారు. శనివారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయ అభివృద్ధిలో భాగంగా దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్ రావ్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ధార్మిక సలహాదారులు గోవింద్ హరిలతో కలిసి దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ కొడంగల్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ... కొడంగల్ వెంకటేశ్వర దేవాలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం ప్రణాళిక బద్ధంగా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం పూర్తిస్థాయిలో తిరుపతి తరహాలో ఆగమ శాస్త్రం ప్రకారం దేవాలయ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, కోనేరు అభివృద్ధి, ప్రసాదం కౌంటర్ల ఏర్పాటు తదితర పనులను చేపట్టి త్వరలో పనులు పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారులతో కలిసి దేవాలయ పునరాభివృద్ధిలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న వారికి ఇండ్ల స్థలాలను కేటాయించిన లేఅవుట్ చేసిన ప్రాంతం, గోశాల, కోనేరును సందర్శించారు. పర్యటనలో భాగంగా వెంకటేశ్వర దేవాలయ సందర్శించుకున్న క్రమంలో వేద పండితులు ప్రిన్సిపల్ సెక్రెటరీ కి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా దేవాలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా దేవాలయ నిర్మాణంతో పాటు వివిధ సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి వాస్తు శిల్పి సత్యనారాయణ మూర్తి పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విజయ కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, దేవాలయ ఇ.ఓ.రాజేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.







## దౌల్తాబాద్ వెంకటేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

### దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** దౌల్తాబాద్ వెంకటేశ్వర దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ అన్నారు. శనివారం కొడంగల్ నియోజకవర్గంలో దేవాలయ శాఖ కమిషనర్ వెంకట్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లతో కలిసి కొడంగల్, దౌల్తాబాద్ లలో గల వెంకటేశ్వర దేవాలయాలను రాష్ట్ర దేవాలయ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయ నిర్మాణానికి నిధులను కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేయగా తమ సూచనల మేరకు ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ సెక్రటరీ మాట్లాడుతూ... దేవాలయ ప్రాంగణం భక్తులకు ఎంతగానో ఆహ్లాదాన్ని కల్పించే విధంగా ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసుకుంటే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. దేవాలయానికి ఆనుకుని ఉన్న చెరువులో బోటింగ్ చేసేందుకు అదేవిధంగా పార్కును ఏర్పాటు వల్ల ప్రజలకు వినోదంతో గడిపేందుకు ఎంతగానో తోడ్పడుతుంద ఆమె అభిప్రాయపడ్డారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి లు ఉన్నారు.



## మలిదశ తెలంగాణ ఉద్యమ కారుల జనరల్ బాడీ మీటింగ్‌ను జయప్రదం చేయండి

**ఆలేరు, రాజముద్ర న్యూస్:** మలిదశ తెలంగాణ ఉద్యమం లో క్రియాశీలక పాత్రను పోషించిన ఉద్యమ కారులకు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇస్తానని చెప్పిన 250 గజాల ఇంటి స్థలం హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమ కారులు ఆర్ జనార్ధన్, మొరిగాడి వెంకటేష్, చెక్క వెంకటేష్, పసుపునూరి వీరేశం, పిక్క శ్రీనివాస్, ఆడేపు బాలస్వామి లు డిమాండ్ చేశారు. ఆగస్టు 5 న ఆలేరు కమలమ్మ జనార్ధన్ ఫంక్షన్ హాల్ లో జరిగే విస్తృత స్థాయి జనరల్ బాడీ మీటింగ్ సన్నాహక సమావేశం ఆలేరు గెస్ట్ హౌస్ లో మొరిగాడి వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తున్న ఈ కాలంలో రాష్ట్రంలో పాలకులు మారారు, అనేక మందికి అధికారం, పదవులు వచ్చాయని, ఇదంతా ఉద్యమకారుల పోరాట ఫలితంగా నే జరిగిందని కానీ, తెలంగాణ మలిదశ ఉద్యమ కారులకు మాత్రం ఒరిగింది ఏమీలేదని ఆవేదన చెందారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో 12 వందల మందికి పైగా ఒరిగిపోయారని, లక్షలాది మంది ఉద్యమంలో పాల్గొని అనేక కష్టాలు, నష్టాల పాలయ్యారని, జీవితాన్ని ఉద్యమానికి రోజులు, నెలల తరబడి వెచ్చించారని, నిరాశ్రయులయ్యారని వారికి కనీస గౌరవం కూడా లేదని ఆవేదన చెందారు. అధికారంలోకి తెలంగాణ ఉద్యమం లో పాల్గొనని, ఉద్యమకారులను ఇబ్బందులకు గురి చేసిన వారికి, ఉద్యమ ద్రోహులకు పదవులు, అధికారం దక్కిందని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న ప్రతి ఒక్క ఉద్యమ కారునికి, ఉద్యమంలో పాల్గొన్న పోరాట వనితలకు ప్రభుత్వం లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆగస్టు 5 న, ఆలేరు కమలమ్మ, జనార్ధన్ ఫంక్షన్ హాల్ లో జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని మలిదశ ఉద్యమకారులు అన్ని గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమ కారులు ఆకవరపు మోహనరావు, పసుపునూరి వీరేశం, ఇక్కిరి శ్రీనివాస్, ఎలగందుల సురేష్, కందగట్ల నరేందర్, కెమిడి ఉప్పలయ్య, ఆలేటి కిషన్, రచ్చ రామనర్సయ్య, బడుగుల జహంగీర్, పూల నాగయ్య, చిమ్మి అబ్బసాయిలు, కర్రె అశోక్, కోటగిరి ఆంజనేయులు, బందెల సుభాష్, దూడం మధు, చాగంటి కృష్ణ, కె అంజయ్య, పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ ప్రతినిధులు ఎలుగల కుమారస్వామి, మంచన మల్లేశం, రవి, కూల్ల సిద్దులు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఫలారం బండి ఊరేగింపు
- అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బోనాల జాతరకు ఆహ్వానం పలుకుతూ ఫలారం బండి కార్యక్రమం చేపడుతున్న బోడుప్పల్ శివాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు కొత్త శ్రీకాంత్ యాదవ్ , ప్రధాన కార్యదర్శి జడిగె సుధాకర్ యాదవ్ లు ఆదివారం సాయంత్రం 6:00 గంటలకు శ్రీశ్రీశ్రీ బంగారం మైసమ్మ దేవాలయం నుండి బయలుదేరునని దీనికిగాను ప్రజా ప్రతినిధులకు, బోడుప్పల్ ప్రజానీకానికి సగర్వంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. అమ్మలగన్నా అమ్మ చల్లని చూపు దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆ అమ్మవారి ఫలారం బండి ఊరేగింపు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ క్లబ్ మాజీ అధ్యక్షులు, సలహాదారులు, కమిటీ మెంబర్స్ ఈగ వెంకటేష్ ముదిరాజ్, శ్రీరాములు, రమేష్,తలరి కృష్ణ యాదవ్, ముదిగొండ బిక్షపతి, కొత్త శ్రీశైలం యాదవ్, దాసరి రమేష్ యాదవ్, శ్రీరాములు, మహేష్ , కాటేపల్లి సత్యం రెడ్డి, కళారి వెంకటేష్ యాదవ్, కటారి అశోక్ యాదవ్, జనిగె వెంకటేష్ యాదవ్, కొత్త వినోద్ యాదవ్, ఈగ మల్లేష్ ముదిరాజ్ , తలారి మల్లేష్ యాదవ్, బజార్ కిరణ్ గౌడ్ లు ఆహ్వానం పలికారు.

## ఆలేరు అంగన్వాడి కేంద్రంలో
# తల్లిపాల వారోత్సవాలు

**ఆలేరు, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో కొలనుపాక రోడ్ లో ఉన్నా అంగన్వాడి కేంద్రం 3 లో తల్లిపాల వారోత్సవాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా మహిళా సాధికారత బృందం మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. తల్లులకు ముర్రుపాల ఆవశ్యకతను తెలిపారు. పోషకాల గూర్చి వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి వివరించారు. జిల్లా మహిళా సాధికారత బృందం మహిళలకు అవగాహన కల్పిస్తూ తమ పిల్లల పట్ల శ్రద్ధ వహిస్తూ, మహిళలు అన్ని రంగాలలో ముందస్తు ఉండాలని చెప్పడం జరిగింది. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం గురించి చెప్పడం జరిగింది. అత్యవసరమైన సమయంలో ఉపయోగపడే టోల్ ఫ్రీ నెంబర్ 181 మహిళలకు 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ ల గురించి, అదేవిధంగా తల్లిపాల వారోత్సవంలో పాల్గొనడం జరిగింది. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా జెండర్ స్పెషలిస్టులు నికిత, భార్గవి ఏ ఎన్ ఎం లు కే సత్యవతి, సువర్ణ, ఆశాలు, మాధవి, సువర్ణ, అంగన్వాడీ టీచర్ ఎ పద్మ, ఆయా ఎమ్ భారతి, తల్లులు బి కావ్య, డి రేఖ, పి మానస, హెమి మా, నిర్మల, వెంకటేశ్వరి, త్రివేణి, సంతోష పాల్గొన్నారు.







## ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

**వలిగొండ రాజముద్ర న్యూస్ :** ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,మండల స్పెషల్ ఆఫీసర్ జగన్నాథ రావు అన్నారు.శనివారం మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు.లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకోవాలని సూచించారు.బేస్మెంట్ వరకు పూర్తిచేసిన వారికి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ-అవుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటిపారుదల ఏఈ రమ్య,పంచాయతీ కార్యదర్శి స్నేహలత,మాజీ ఎంపీటీసీ వనగంటి రమేష్,దుబ్బ అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.




## ఫోర్జరీ పత్రాలతో
# మా ప్లాట్లను కబ్జాకు యత్నం

- అధికార పార్టీ నాయకుల పేర్లతో దిలీప్ రెడ్డి బెదిరింపులు
- విలేకరుల సమావేశంలో విష్ణుపురి, శ్రీపాద కాలనీ ప్లాట్ల బాధితులు

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** ఫోర్జరీ పత్రాలతో మా ప్లాట్లను కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని విష్ణుపురి, శ్రీపాద కాలనీ ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో బాధితులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విష్ణుపురి, శ్రీపాద కాలనీలో సర్వేనెంబర్ 79/ఆ,124ఆ,125/ఆ,126/ఆ,122/ఆ లో భూ యజమానుల నుండి పోగుల నరసింహారెడ్డి జిపిఏ తీసుకుని ప్లాట్లు చేసి అమ్మగా మేము ప్లాట్లను కొనుగోలు చేశామన్నారు. వాటికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్, మున్సిపల్ పర్మిషన్ తీసుకొని నిర్మాణం చేసుకోవడానికి మేము మా స్థలం దగ్గరకు వెళ్లగా జమాల్, కాశీం భూ యజమానులతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకొని దిలీప్ రెడ్డి అనే వ్యక్తి కొంతమంది గుండాలతో చంపుతామని బెదిరించి మాపై దౌర్జన్యం చేస్తుండగా 100కు కాల్ చేసి పోలీసులను ఆశ్రయించగా మొబైల్ వాహనంలో వచ్చిన పోలీసులు అక్రమార్కులకే వత్తాసు పలికి వారికే సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి పలుమార్లు పిఎస్ లో ఫిర్యాదు చేసి కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నా పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా మాకు ప్రభుత్వం జోక్యం చేసుకుని న్యాయం చేసి మా ప్లాట్లను మాకు దక్కేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తోట శ్రీనివాస్ రెడ్డి, ధర్మారావు, కే వెంకటయ్య,రామారావు, జె.యన్.గౌడ్, ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

### పోలిసులే దగ్గర ఉండి కబ్జా దారులకు సపోర్ట్ చేస్తున్నారు

మాకు న్యాయం చేయమని స్థానిక పోలీసులను ఆశ్రయించగా పోలీసులే దగ్గర ఉండి కబ్జాదారులకు సపోర్ట్ చేస్తున్నారని కాలనీ వాసులు వాపోయారు. మేడిపల్లి సీఐ మమ్ములను నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఎక్కడ చెప్పుకుంటారో నా ఇష్టం వచ్చినట్లు చేస్తానని అన్నాడని కాలనీ వాసులు తెలిపారు. రక్షణ కల్పించవల్సిన పోలీసులే కబ్జా దారులకు సపోర్ట్ చేస్తే మేము ఎవరి చెప్పుకోవాలో తెలియడం లేదని, అందుకే మీడియాను ఆశ్రయించామని తెలిపారు.

### ఆరోపణలు అవాస్తవం
**- మేడిపల్లి సీఐ అర్. గోవింద్ రెడ్డి**

స్థలం వివాదం విషయంలో మేం ఎవరికి మద్దతు ఇవ్వలేదు. ఘర్షణ వాతావరణం రాకుండా ఇతరులకు ఇబ్బంది కలుగకుండా పరిష్కారం చేసుకోవాలని ఇరు వర్గాలకు చెప్పటం జరిగింది. ఈ విషయంలో మాకు ఎవరి వత్తిడి లేదు మేం చట్టపరంగా మా విధులను సక్రమంగా నిర్వహించడం జరుగుతుంది.

## 9 మంది పంచాయతీ కార్యదర్శులు సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్

### ఆరుగురు ఎంపీవోలకు షోకాజులు జారీ



**భువనగిరి రాజముద్ర న్యూస్:** విధులకు హాజరు కాకుండా నకిలీ హాజరు నమోదు చేసి విదులలో నిర్లక్ష్యం వహించిన 9 మంది పంచాయితీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం సస్పెండ్ చేశారు.పంచాయితీ కార్యదర్శులు వారి విధులలో భాగంగా ప్రతిరోజు డీఎస్ఆర్ యాప్లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని,కానీ వారు నకిలీ హాజరు నమోదు చేసినట్లు తెలియడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.అదేవిదంగా పంచాయితీ కార్యదర్శులను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం చేసిన ఆరుగురు మండల పంచాయితీ అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేశారు.

## 400 మంది నుంచి
# రూ.19 కోట్ల వసూలు

### అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా గుట్టురట్టు

**హైదరాబాద్ :** క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు చేస్తున్న అంతర్జాతీయ సైబర్ ముఠా గుట్టును హైదరాబాద్ మేడిపల్లి పోలీసులు ఛేదించారు. వివిధ దేశాలకు చెందిన సైబర్ ముఠాలతో కలిసి పనిచేస్తున్న నిందితుడిని పట్టుకున్నారు. నగర శివారు చెంగిచెర్లలోని ఓ హోటల్‌లో ఉంటూ నిందితుడు ఒక యాప్ ద్వారా 400 మంది నుంచి రూ.19 కోట్లు వసూలు చేసినట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు కేసు వివరాలు... ముంబయికి చెందిన హిమాన్షు సింగ్(35)కు అమెరికాకు చెందిన లూయిస్ హరిడో సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమయ్యాడు. వీరిద్దరూ కలిసి ఓ యాప్ సృష్టించి తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలిస్తామని ప్రచారం మొదలుపెట్టారు. హిమాన్షు చెంగిచెర్లలోని ఓ హోటల్‌లో ఉంటూ డబ్బు జమయ్యే వ్యాలెట్‌ను నిర్వహించేవాడు. వియత్నాంకు చెందిన రిక్కీపామ్ విదేశాల్లో కోఆర్డినేటర్‌గా పనిచేస్తుండగా.. థాయ్‌లాండ్‌లో ఉండే రాజస్థాన్ వాసి అశోక్‌శర్మ, డీజే సొహైల్, మోహన్, అశోక్‌కుమార్‌సింగ్ సహకారం అందించేవారు. భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాక విత్‌డ్రా చేసుకోవడానికి వీల్లేకుండా చేసేవారు. కొట్టేసిన డబ్బును బోడుప్పల్‌లోని ట్రావెల్ మాస్టర్ కార్పొరేషన్ ఖాతాలకు బదిలీ చేసేవారు. నిందితులు గతంలోనూ కొన్ని యాప్‌లు సృష్టించి కరీంనగర్, జగిత్యాల, వరంగల్ జిల్లాలకు చెందిన వేల మందిని మోసగించినట్లు పోలీసులు గుర్తించారు.



## పాక్-బంగ్లా వైమానిక దళ ఒప్పందం..?

# అప్రమత్తమైన భారత్

**బంగ్లాదేశ్ :** షేక్ హసీనా తన పదవి కోల్పోయిన తర్వాత తాత్కాలిక సారథి నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్థాన్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఆ దేశంతో వాణిజ్య, స్నేహ సంబంధాలను ఏర్పరుచుకుంటోంది. మరోవైపు బంగ్లాదేశ్, పాకిస్థాన్ సైన్యాల మధ్య సంబంధాలు బలపడటాన్ని ఢిల్లీ గమనిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో భారత నిఘా వర్గాలకు కీలక సమాచారం అందింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వైమానిక దళ అధికారులు ఏప్రిల్ 15 నుంచి 19 వరకు రహస్య చర్చలు చేపట్టినట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో ఇస్లామాబాద్, ఢాకాల మధ్య సైనిక భాగస్వామ్యం వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు తెలుస్తోంది. ఈ రహస్య సమావేశంలో ఇరుదేశాల వైమానిక దళ చీఫ్‌లు డ్రోన్ యుద్ధం, వ్యూహాత్మక కమ్యూనికేషన్లు, అంతరిక్ష కార్యకలాపాలు, సైబర్ సెక్యూరిటీ సిస్టమ్, ప్రపంచ రాజకీయ పరిస్థితులు మొదలైన విషయాల గురించి చర్చించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా డ్రోన్ స్వార్మింగ్, అటానమస్ ఎయిర్ కంబాట్ సిస్టమ్‌లకు కీలకమైన మాడ్యులర్, అన్‌మ్యాన్డ్ మిషన్ ట్రైనర్స్ సిమ్యులేటర్‌ల ఉమ్మడి అభివృద్ధిపై వీరు ప్రధానంగా దృష్టిపెట్టినట్లు సమాచారం. కాగా చైనా సహాయంతో తన డ్రోన్ యుద్ధ సామర్థ్యాలను పాకిస్థాన్ మెరుగుపరుచుకుంటున్న విషయం తెలిసిందే. ఈ కార్యాచరణ పరిజ్ఞానాన్ని దాయాది దేశం ఢాకాకు కూడా బదిలీ చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు భావిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఎలైట్ 1 పారా కమాండో బెటాలియన్‌కు ప్రత్యేక ఆయుధాలను బదిలీ చేయడం, బంగ్లా దళాలకు పాక్ సైనిక శిక్షణ ఇవ్వడానికి చర్యలు, పాక్ నుంచి అబ్దాలీ స్వల్పశ్రేణి క్షిపణులను, తుర్కియే నుంచి బంగ్లాదేశ్ యుద్ధ ట్యాంకులనూ కొనుగోలు చేయడం వంటి విషయాలపై ఇరుదేశాలు ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా కూడా ఇస్లామాబాద్-బంగ్లా మధ్య పలు చర్చలు జరిగినట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందులోభాగంగా బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్‌ను పదవి నుంచి తొలగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు పలు కథనాలు వెలువడుతున్నాయి. దీంతో భారత నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. సరిహద్దు ప్రాంతాల్లో రక్షణను మరింత పెంచడం, ఆయుధ సంపత్తిని పెంపొందించడానికి భారత రక్షణ, సైనిక వర్గాలు చర్యలు తీసుకుంటున్నాయి.

# విచారించేందుకు వస్తే..

## దుస్తులు విప్పేసి దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడి నిరసన



**సియోల్ :** అనూహ్యంగా ఎమర్జెన్సీ ప్రకటించి జైలు పాలయ్యారు దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్. ఆయనపై పలు కేసులు నమోదవగా.. అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ కేసులకు సంబంధించి విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరిస్తూనే ఉన్నారు. తాజాగా ఆయనను ప్రశ్నించేందుకు అధికారులు మరోసారి జైలుకు రాగా.. వారిముందు దుస్తులు విప్పేసి అర్ధనగ్నంగా నేలపై పడుకున్నారు. ఎమర్జెన్సీ వివాదంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో యూన్ సుక్ యోల్ అభిశంసనకు గురై పదవి నుంచి దిగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం ఆయనపై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. దీంతో గత నెల ఆయన ను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన సియోల్‌లోని ఓ జైలులో ఉన్నారు. అవినీతి కేసుల్లో ఆయనను విచారించాలని కొత్త అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ ఆదేశాలిచ్చారు. ఈక్రమంలోనే ప్రత్యేక అధికారుల బృందం కోర్టు నుంచి డిటెన్షన్ వారెంట్ తీసుకొని జైలుకు చేరుకుంది. విచారణకు స్వచ్ఛందంగా రాకపోతే బలవంతంగానైనా ఆయనను డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్లేందుకు న్యాయస్థానం నుంచి అధికారులు అనుమతి తీసుకున్నారు. అయినప్పటికీ విచారణకు హాజరయ్యేందుకు ఆయన నిరాకరించారు. అధికారులు రాగానే మాజీ అధ్యక్షుడు జైలు యూనిఫామ్ తొలగించి అర్ధనగ్నంగా నేలపై పడుకొని నిరసన తెలిపారు. దీంతో చేసేదేం లేక, అధికారులు అక్కడినుంచి వెనుదిరిగారు.



# ఆమె ఓ మెషీన్‌గన్

## వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీపై ట్రంప్ ప్రశంసలు

**యూఎస్ :** వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు కురిపించారు. న్యూస్‌మాక్స్‌లో రాబ్ ఫిన్నెర్టీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాకు అధ్యక్షుడిగా సేవలు అందించిన అందరు అధ్యక్షుల్లో తనకు మాత్రమే అద్భుతమైన, ఉత్తమ ప్రెస్ సెక్రటరీ ఉందని అన్నారు. కరోలిన్ లీవిట్ మెషీన్‌గన్‌లా పనిచేస్తూ.. తన విధులను సమర్థమంతంగా నిర్వర్తిస్తోందన్నారు. అందం, హుందాతనంతో ప్రజల్లో ఓ స్టార్‌గా మారిపోయిందని పేర్కొన్నారు. కరోలిన్ మాట్లాడేటప్పుడు ఆమె పెదాల కదలిక చాలా అందంగా ఉంటుందని పొగిడారు. అదే ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ.. అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామాపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. 2016 ఎన్నికల్లో తాను విజయం సాధించిన తర్వాత తన పాలనను నియంత్రించేందుకు ఒబామా సన్నిహిత వర్గాలు అసత్య ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకుందంటూ తప్పుడు వాదన తెచ్చారని ఆరోపించారు. దీనికి ఆయన తగిన మూల్యం చెల్లించు కోవాల్సి ఉంటుందన్నారు. మరో వైపు కరోలిన్ లీవిట్ కూడా అమెరికా అధ్యక్షు డిపై ప్రశంసలు గుప్పించారు. ట్రంప్ ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన నేత అని కొనియాడారు. ఆయన భారత్- పాక్ మధ్య జరిగిన ఘర్షణతో సహా ప్రపంచ వ్యాప్తంగా థాయ్‌లాండ్-కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్- ఇథియోపియా, రువాండా- కాంగో డెమోక్రాటిక్ రిపబ్లిక్ వంటి అనేక యుద్ధాలను ముగించారన్నారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్ హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందుకుగాను ఆయనకు నోబెల్ శాంతి పురస్కారాన్ని అందించాలని కోరారు. గత కొంతకాలంగా ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి తనకు వస్తుందని ఆశగా ఉన్నారు. నోబెల్ శాంతి బహుమతికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరును ఇజ్రాయెల్, పాకిస్థాన్ ప్రతిపాదించాయి. తాను ఎన్ని యుద్ధాలు ఆపినా తనకు నోబెల్ శాంతి బహుమతి రాదేమోనని ఆయన పలుమార్లు నైరాశ్యం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో కరోలిన్ లీవిట్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## భారత్‌ది డెడ్ ఎకానమీయా..?

# డైనమిక్

### భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి..

### ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది'

### ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా సమాధానమిచ్చిన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లు




**న్యూయార్క్, ఆగస్ట్ 2 :** ప్రస్తుత సాంకేతిక యుగంలో ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీ వంటి వాటికి ప్రత్యేక ఆదరణ ఉంది. ఎలాంటి ప్రశ్నలకైనా ఈ కృత్రిమ మేధస్సు ప్లాట్‌ఫామ్‌లు సమాధానం చెప్పగలవు. ఈ క్రమంలోనే భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే ప్రశ్నను పలు ఏఐ ప్లాట్‌ఫామ్‌లను అడగ్గా.. అవి చెప్పిన సమాధానాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. భారత్‌ది డెడ్ ఎకానమీయా? అని ఐదు ప్రధాన అమెరికన్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లను ప్రశ్నించగా.. వాటి సమాధానాలు ట్రంప్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఉన్నాయి. అవి ఏం చెప్పాయంటే.. 'భారత ఆర్థికవ్యవస్థ పతనం కాలేదు. అది డైనమిక్. ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది' అని చాట్‌జీపీటీ పేర్కొంది. 'లేదు. భారత్‌ది డెడ్ ఎకానమీ కాదు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి'- గ్రోక్. ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతుంది' – జెమిని. ఇక, మెటా ఏఐ, కోపైలట్‌లు కూడా ఇలాంటి సమాధానాలే ఇచ్చాయి. మావద్ద తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయి.. అమెరికా హెచ్చరికలపై రష్యా రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తుందనే కారణంతో భారత్‌పై 25శాతం సుంకం, పెనాల్టీలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్.. వాటి డెడ్ ఎకానమీలను మరింత దిగజార్చుకునే అవకాశముందన్నారు. వారు ఎలాంటి వాణిజ్య సంబంధాలు కుదుర్చుకున్నా పట్టించుకోనన్నారు. ఈ వ్యాఖ్యలను భారత్ తోసిపుచ్చింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. మరోవైపు, ట్రంప్ మాటలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సమర్థించారు. ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ఆ విషయాన్ని ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలను సొంత పార్టీ నేతలు సైతం తప్పుబట్టడం గమనార్హం.

## 'ప్రధాని మోదీ పేరు చెప్పాలని

# నాపై ఒత్తిడి తెచ్చారు'

### మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్

**న్యూఢిల్లీ :** మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. "భాజపా సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని వారు నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల ప్రధాని మోదీ రు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదు" అని ప్రజ్ఞ మీడియాతో మాట్లాడారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు చెప్పారు. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందితో పాటు రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు



కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని ఎన్ఐఏ కోర్టు తెలిపింది. "ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్.. మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు" అని తీర్పు వెలువరించింది.

# ఆ అణుబాంబును పేల్చనివ్వండి

### రాహుల్‌కు రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం, భాజపాపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన తీవ్రవ్యాఖ్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఆ అణుబాంబును పేల్చనివ్వండని వ్యాఖ్యా నించారు. "తనవద్ద అణుబాంబు ఉందని రాహుల్ గాంధీ అన్నారు. అయితే ఆయన దానిని వెంటనే పేల్చాలి. అది పేలేటప్పుడు దానివల్ల తనకు హాని కలగకుండా చూసుకో వాలి. గతంలో భూకంపం అంటూ హెచ్చరికలు చేశారు. కానీ తర్వాత అది తుస్సుమంది" అని కౌంటర్ ఇచ్చారు. రాజ్యాం గబద్ధమైన సంస్థ (ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి)పై ఇలాంటి ప్రకటనలు చేయడం ప్రతిపక్ష నేతకు తగదని మండిపడ్డారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను ఈసీ నేడు విడుదల చేసింది. అయితే, ఈ ప్రక్రియను ముందు నుంచీ వ్యతిరేకిస్తోన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్ర స్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని మేం ఎప్పటినుంచో అనుమానిస్తు న్నాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో పాటు లోక్‌సభలో ఎన్నిక ల్లోనూ అక్రమాలు జరిగాయి. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారు. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే.. ఈసీ గురించి బయటపడింది. ఆరు నెలల పాటు మేం సొంతంగా దర్యాప్తు జరిపి ఆటంబాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు" అని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. మరో సందర్భంలో దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని రాహుల్ అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. మరో 15 సీట్లు రాకపోయుంటే మోదీ ప్రధాని కాకపోయేవారని పేర్కొన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.



# మావద్ద తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయి

### అమెరికా హెచ్చరికలపై రష్యా

**రష్యా :** రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ హెచ్చరికలకు ప్రతిస్పందనగా.. ఆ దేశానికి చేరువలో సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను అమెరికా మోహరించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా రష్యా పార్లమెంటు సభ్యుడు విక్టర్ వోడోలాట్‌స్కీ స్పందిస్తూ.. తమ వద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈమేరకు పలు మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. అమెరికాను ఎదుర్కొనేందుకు తమవద్ద కూడా తగినన్ని అణు జలాంతర్గాములు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే మహాసముద్రాల్లో యూఎస్ జలాంతర్గాముల సంఖ్య కంటే తమవి చాలా ఎక్కువని వెల్లడించారు. వారు మోహరించినవి తమ జలాంతర్గాముల నియంత్రణలో ఉన్నాయన్నారు. కాబట్టి.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలకు ప్రతిస్పందించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఇక, దీనిపై గ్లోబల్ అఫైర్స్ మ్యాగజైన్ రష్యా ఎడిటర్ ఇన్‌చీఫ్ ఫ్యోడర్ లుక్యానోవ్ మాట్లాడుతూ.. ట్రంప్ హెచ్చరికలను ప్రస్తుతానికి తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం లేదన్నారు. అంతకుముందు మాస్కో, వాషింగ్టన్‌ల మధ్య ప్రత్యక్ష సైనిక ఘర్షణలు జరగకూడదని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వాదనతో తాను ఏకీభవిస్తానని రష్యా విదేశాంగ మంత్రి సెర్గా లావ్‌రోవ్ పేర్కొన్నారు. రష్యాకు చేరువలోని సముద్ర జలాల్లో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని ఆదేశించానని ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. దిమిత్రీ రెచ్చగొట్టే వ్యాఖ్యల వెనక ఏదైనా ఉద్దేశాలు ఉంటే వాటికి సన్నద్ధమయ్యేందుకు ఇలా చేసినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుత పరిణామాల్లో అలాంటివి జరగవని ఆశిస్తున్నానన్నారు.

# తక్కువ శిక్ష వేయండి.. ప్లీజ్

- కోర్టులో బిగ్గరగా ఏడ్చేసిన ప్రజ్వల్ రేవణ్ణ
- జీవిత ఖైదు ఖరారు చేసిన న్యాయస్థానం



**బెంగళూరు :** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు జీవిత ఖైదు పడింది. దీంతోపాటు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే.. రేవణ్ణను దోషిగా తేల్చిన విషయం తెలిసిందే. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపీ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. ఆగస్టు 1న తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరమూ వెక్కివెక్కి ఏడ్చాడు. కేఆర్ నగరకు చెందిన మహిళ 2024 ఏప్రిల్ 28న హొళెనరసీపుర ఠాణాలో ప్రజ్వన్ రేవణ్ణపై ఫిర్యాదు చేయడంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై అత్యాచారం జరిగిందని బాధితురాలు (47) తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మరికొన్ని అత్యాచార కేసులు ప్రజ్వల్‌పై నమోదయ్యాయి. ఈ కేసు విచారణలో భాగంగా 14 నెలలుగా ప్రజ్వల్ కారాగారంలో విచారణ ఖైదీగా ఉండగా తాజాగా శిక్ష ఖరారైంది.







# బౌలర్లు సత్తా చాటితేనే..

- జైస్వాల్ సెంచరీ
- ఇంగ్లాండ్ లక్ష్యం 374.. ప్రస్తుతం 50/1

**లండన్:** భారత్–ఇంగ్లాండ్ టెస్టు సిరీస్ రసవత్తర ముగింపు ముంగిట నిలిచింది. సిరీస్ ఫలితం నాలుగో రోజైన ఆదివారమే తేలిపోయే అవకాశముంది. బౌలర్ల శ్రమకు న్యాయం చేస్తూ బ్యాటర్లూ అదరగొట్టడంతో ఇంగ్లాండ్‌కు భారత్ 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట చివరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. డకెట్ (34 బ్యాటింగ్)తో కలిసి జట్టుకు శుభారంభాన్నందించిన క్రాలీ (14)ని.. ఆఖర్లో సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆటను భారత్ సంతృప్తిగా ముగించింది. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో అంచనాలను మించి ఆడిన భారత్.. 396 పరుగులు చేసి ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (118, 164 బంతుల్లో 14(4), 2(6)) కెరీర్లోనే అత్యంత విలువైనది అనదగ్గ శతకం సాధించాడు. రెండో రోజు నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్‌దీప్ (66, 94 బంతుల్లో 12(4)) అర్ధశతకంతో ఇంగ్లిష్ బౌలర్లకు షాకిచ్చాడు. జడేజా (53బీ 77 బంతుల్లో 5ఐ4), సుందర్ (53, 46 బంతుల్లో 4(4), 4(6)) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ (5/125), అట్కిన్సన్ (3/127), ఒవర్టన్ (2/98) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224 పరుగులకు ఆలౌట్ కాగా.. ఇంగ్లాండ్ 247 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

## ఆకాశ్‌దీప్ అదరహో..

75/2.. రెండో రోజు ఆట చివరికి భారత్ స్కోరిది. రెండు సెషన్లయినా నిలిస్తే.. స్కోరు 300 దాటితే మ్యాచ్ గెలిచేందుకు మెరుగైన అవకాశాలు ఉంటాయన్న అంచనా. అయితే భారత్ అంచనాలను మించిపోయింది. ఇంకో 70 ఓవర్లు బ్యాటింగ్ చేసింది. దాదాపు 400 స్కోరు చేసింది. ముందు రోజు నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్‌దీప్ స్పెషలిస్టు బ్యాటర్ తరహాలో ఆడి అర్ధశతకం సాధించడం మూడో రోజు ఆటలో అసలైన హైలైట్. యశస్వి జైస్వాల్ జోరు కొనసాగిస్తూ సెంచరీ పూర్తి చేసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వస్తే.. మధ్యలో జడేజా కీలక ఇన్నింగ్స్‌తో జట్టును మెరుగైన స్థితికి చేర్చాడు. ఆఖర్లో వాషింగ్టన్ సుందర్ ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునిచ్చాడు. ఇంగ్లాండ్ ఏ దశలోనూ వెంటవెంటనే వికెట్లు సాధించలేకపోయింది. ఒక వికెట్ పడ్డా.. వెంటనే ఒక భాగస్వామ్యం నమోదు చేయడం ద్వారా ప్రత్యర్థికి పైచేయి సాధించే అవకాశం లేకుండా చూసింది.మొత్తంగా సమష్టి కృషితో భారత్ ఇంగ్లాండ్‌కు సవాలు విసిరే లక్ష్యాన్ని నిర్దేశించింది.

## బౌలర్లు సత్తా చాటితేనే..

ఉదయం చకచకా కొన్ని వికెట్లు తీసి భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని చూసిన ఇంగ్లాండ్‌కు ఓవర్‌నైట్ జోడీ చెక్ పెట్టింది. లాంఛనమనుకున్న ఆకాశ్‌దీప్ వికెట్‌ను పడగొట్టడానికి కూడా ఆ జట్టు బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. తాను చేసే ప్రతి పరుగూ జట్టుకు బోనస్‌గా మారే స్థితిలో ఆకాశ్‌దీప్ సాధికారికంగా ఆడి ఇంగ్లాండ్‌కు చెక్ పెట్టాడు. అతను అలవోకగా బౌండరీలు బాదుతూ ప్రత్యర్థి బౌలర్లను ఏడిపించాడు. ఆకాశ్ ఇన్నింగ్స్‌లో 12 బౌండరీలుండడం.. వాటితోనే 48 పరుగులు రావడం విశేషం. 70 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన ఆకాశ్‌దీప్.. ఆ తర్వాత కూడా జోరు కొనసాగించాడు. మరో ఎండ్‌లో జైస్వాల్ నిలకడగా ఆడడంతో భారత్ 177/2తో తిరుగులేని స్థితికి చేరుకుంది. లంచ్ విరామానికి కాస్త ముందు అతను ఔట్ కావడంతో ఇంగ్లాండ్ ఊపిరి పీల్చుకుంది. లంచ్‌కు స్కోరు 189/3. అయితే విరామానంతరం వెంటనే కెప్టెన్ శుభ్‌మన్ (11) ఔటైపోయాడు. అతణ్ని అట్కిన్సన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఈ స్థితిలో జైస్వాల్.. కరుణ్ నాయర్ (17), జురెల్ (34)ల సహకారంతో స్కోరును 300 దాటించాడు. ఈ క్రమంలోనే అతడి శతకం పూర్తయింది. ఆ తర్వాత అతను టంగ్ బౌలింగ్‌లో ఔటైపోయాడు. తర్వాత జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. జురెల్ కూడా విలువైన పరుగులు సాధించాడు. టీ విరామానికి 304/6తో ఎంతో మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ మూడో సెషన్లో ఇంగ్లిష్ బౌలర్లు కొంచెం పుంజుకున్నారు. 24 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీశారు. జురెల్, జడేజా ఒకరి తర్వాత ఒకరు ఔటైపోయారు. సిరాజ్ డకౌటవడంతో స్కోరు 357/9కు చేరుకుంది. ఇక పెద్దగా స్కోరు పెరిగే అవకాశం లేదనే అంతా అనుకున్నారు. కానీ అవతలి ఎండ్‌లో ప్రసిద్ధ్‌ను పెట్టుకుని సుందర్.. భారీ షాట్లకు దిగాడు. సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తించాడు. 9వ వికెట్ పడేసరికి 17 పరుగులే చేసిన సుందర్.. 3 ఓవర్ల వ్యవధిలో అర్ధశతకం పూర్తి చేయడం విశేషం. అతణ్ని ఔట్ చేసి 5 వికెట్ల ప్రదర్శన పూర్తి చేసిన టంగ్.. భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.



## జైస్వాల్ శతకం రోహిత్‌కు అంకితం

భారత్-ఇంగ్లాండ్ చివరి టెస్టు మూడో రోజు ఆట చూసేందుకు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రావడం విశేషం. ఓవల్ స్టేడియం స్టాండ్స్‌లో అతను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. రోహిత్‌ను ఎంతో ఆరాధించే ఓపెనర్ యశస్వి జైస్వాల్.. తన శతకాన్ని అతడికే అంకితం ఇచ్చాడు. మూడంకెల స్కోరుకు చేరుకోగానే రోహిత్ వైపు చూస్తూ అతను అభివాదం చేశాడు. అంతే కాక గ్లోవ్స్ తీసేసి లవ్ సింబల్ పెట్టి తన ఆరాధ్య ఆటగాడిపై తన ప్రేమను చాటుకున్నాడు.




# ఆటోపైలట్ తప్పిదంతో ప్రమాదం..

### టెస్లాకు రూ.2,100కోట్ల జరిమానా

అమెరికాకు చెందిన దిగ్గజ ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ సంస్థ టెస్లాకు భారీ జరిమానా పడింది. 2019 నాటి రోడ్డు ప్రమాదం కేసులో టెస్లా కారులోని ఆటో పైలట్ వ్యవస్థ తప్పిదమే ప్రమాదానికి కారణమని ఫ్లోరిడా కోర్టు నిర్ధరించింది. దీంతో బాధితులకు 242 మిలియన్ డాలర్ల పరిహారం (భారత కరెన్సీలో దాదాపు రూ.2,100కోట్లు) చెల్లించాలని కంపెనీని ఆదేశించింది. నాటి ప్రమాదంలో ఓ యువతి మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడ్డారు. 2019లో ఫ్లోరిడాలోని కీ లార్గోలో ఈ ఘటన చోటు చేసుకుంది. జార్జ్ మెక్‌గీ అనే వ్యక్తి తన టెస్లా కారులో వెళ్తూ అధునాతన ఆటోపైలట్ ఫీచర్‌ను ఉపయోగించాడు. ఇది టెస్లా అందించిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ వ్యవస్థ. మార్గమధ్యలో తన మొబైల్ ఫోన్ కారులో కింద పడిపోయింది. ఎలాగూ కారు ఆటోపైలట్ మోడ్‌లోనే ఉందని భావించిన జార్జ్.. కిందకు వంగి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో కారు అదుపుతప్పి పక్కనే పార్క్ చేసి ఉన్న ఓ కారును ఢీకొట్టి ఇద్దరు వ్యక్తుల పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ 22 ఏళ్ల యువతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఆమె స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద తీవ్రతకు యువతి మృతదేహం 75 అడుగుల దూరంలో ఎగిరిపడింది. ఈ ఘటనపై బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించాయి. దీనిపై సుదీర్ఘ విచారణ తర్వాత తాజాగా ఫ్లోరిడా కోర్టు తీర్పు వెలువరించింది. ఈ ప్రమాదానికి గానూ బాధితుల కుటుంబాలకు 329 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆటోపైలట్ వ్యవస్థ తప్పిదం కూడా ప్రమాదానికి ఓ కారణమేనని గుర్తించిన కోర్టు.. ఇందుకు గానూ పరిహారంలో మూడోవంతు అంటే దాదాపు 242 మిలియన్ డాలర్లు టెస్లా కంపెనీ చెల్లించాలని ఆదేశించింది. మిగతా మొత్తం సదరు వాహన డ్రైవర్ ఇవ్వాలని స్పష్టంచేసింది. అయితే, ఈ తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు టెస్లా తెలిపింది.

# కనీసం 80 గంటలు పనిచేయాలి

పనిగంటలపై ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి గతంలో చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకే దారితీశాయి. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో యువత 70 గంటల పాటు పనిచేయాలంటూ ఆయన చేసిన సూచనకు కొంతమంది మద్దతుగా నిలిస్తే.. మరికొంత మంది తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత యువ వ్యాపారవేత్త కూడా నారాయ–ణమూర్తి వంటి వాదనే వినిపించారు. ఆమె ఏఐసంస్థ ఏప్రిల్‌ను స్థాపించిన నేహా సురేశ్. ఆమె, తన సహ వ్యవస్థాపకుడు ఆకాశ్ పనిచేస్తోన్న వీడియోను నెట్టింట్లో షేర్ చేశారు. ఒక చిన్నపాటి ఆఫీసులో రెండువేర్వేరు డెస్కుల్లో ఆకాశ్, నేహా తమ రోజూవారీ పని ఎలా నడుస్తుందో ఆ వీడియోలో చూపించారు. వారు పూర్తిగా పనిలో నిమగ్నమై, మధ్యమధ్యలో చిన్న బ్రేకులు తీసుకోవడం కనిపించింది. ఈ దృశ్యాలతో పాటు ఆమె తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. “మీ కలను సాకారం చేసుకోవడానికి రోజుకు 14 గంటలు వెచ్చించకపోతే.. మీరు దానిని సాధించుకోలేరు. 9–5 పని గంటలతో మీరు ఈ ప్రపంచాన్ని మార్చే ఉత్పత్తిని తయారు చేయలేరు. వారానికి 80 గంటలు అనేది తీవ్రమైనది కాదు. అవి కనీస స్థాయి పనిగంటలు మాత్రమే” అని నేహా చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు ఆమె నిబద్ధతను మెచ్చుకున్నారు. మరికొందరు మాత్రం ఇలాంటి జీవనశైలి అందరికి సరిపోతుందా..?అని ప్రశ్నించారు. ప్రపంచాన్ని మార్చే ఉత్పత్తులను ఈ 9–5, 80 పని గంటలతో మాత్రమే కాకుండా ఇంకా ఇతర మార్గాల్లో కూడా రూపొందించవచ్చు” అని కామెంట్ చేశారు. గతంలో నారాయణమూర్తి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత తక్కువన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. మనమూ అలా శ్రమించాలని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే వారానికి 90 గంటల పాటు పనిచేయాలని, ఆదివారం సెలవునూ వదిలేయాలని ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి. “అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం. ఈ విస్తృత లక్ష్యాన్నే ఛైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయి” అని అప్పట్లో సంస్థ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.






# ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ విడుదల

టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్టోర్మ్ ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్ , నజీరుద్దీన్ భరతరాజ్ , సిలంబరసన్ టిఆర్ (శింబు) , దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి పాడారు.

# వరుస ఆఫర్స్ అందుకుంటున్న సంయుక్త



ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అనతి కాలంలోనే మంచి క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్స్‌లో సంయుక్త ఒకరు. బింబిసారా, సార్, విరూపాక్ష వంటి సినిమాల్లో తన నటనతో ప్రేక్షకులను మెప్పించిన ఈ అమ్మడు ప్రస్తుతం వరుస ఆఫర్లు అందుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఈ బ్యూటీ తెలుగులో స్వయంభూ, శర్వా37తో పాటు అఖండ-2లో కూడా నటిస్తుంది. అలాగే మలయాళం, హిందీలో కూడా ప్రాజెక్టులు లైన్‌లో పెట్టింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ అమ్మడు మరో బంపర్ ఆఫర్ అందుకున్నట్లు ఇన్‌సైడ్ టాక్. మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ మూవీ వస్తున్న సంగతి తెలిసిందే. 'మన శంకర వరప్రసాద్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ మూవీ ఇప్పటికే నయనతారను హీరోయిన్‌గా ఫిక్స్ చేస్తూ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. ఇప్పుడు సెకండ్ హీరోయిన్‌గా సంయుక్తను ఫైనల్ చేశారట మేకర్స్. అలాగే త్వరలో దీనిపై అధికారిక ప్రకటన రానున్నట్లు ఇండస్ట్రీ వర్గాల నుంచి సమాచారం.


# 'మహావతార్ నరసింహ' మరో రికార్డు

ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది 'మహావతార్ నరసింహ'. మొదటిరోజు నుంచే పాజిటివ్ టాక్‌తో వసూళ్లను సొంతం చేసుకుంటోంది. తాజాగా ఈ సినిమా మరో మైలురాయిని చేరుకుంది. దేశంలోని యానిమేటెడ్ సినిమాల్లో చరిత్ర సృష్టించింది. హెూంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమా 8 రోజుల్లోనే రూ.60.5 కోట్లు వసూళ్లను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన యానిమేటెడ్ సినిమాగా రికార్డు నెలకొల్పిందని పేర్కొంది. 8 రోజుల్లోనే ఈ ఘనతను సాధించడం ఆనందంగా ఉందని తెలిపింది. మరోవైపు అమెరికాలోనూ ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిందని అక్కడి నిర్మాణసంస్థ వెల్లడించింది. ఇది డివైన్ బ్లాక్‌బస్టర్ అని పేర్కొంది. 'మహావతార్ నరసింహ' దర్శకుడు అశ్విన్‌కుమార్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ఒకవేళ భవిష్యత్తులో ఈ ఫ్రాంచైజీలో లైవ్ యాక్షన్ సినిమాను తెరకెక్కిస్తే రాముడిగా ఎవరిని ఎంపిక చేసుకుంటారని అడిగిన ప్రశ్నకు ఆయన రామ్‌చరణ్‌ను ఎంపిక చేసుకుంటానని చెప్పారు. దీంతో ఈ కామెంట్‌ను చరణ్ అభిమానులు షేర్ చేస్తున్నారు.




# చెప్పు తెగుద్ది..
## అనసూయ స్ట్రాంగ్ వార్నింగ్

టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.







# దూసుకుపోతున్న సైయారా మూవీ
## సైలెంట్‌గా కలెక్షన్లు రాబడుతున్నట్లు వెల్లడి

అహన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్-టైనర్ 'సైయారా' మూవీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రం ప్రస్తుతం మూడో వారంలోకి అడుగు పెట్టింది. శుక్రవారం 'సన్ ఆఫ్ సర్దార్ 2' , 'ధడక్ 2' విడుదలైనప్పటికీ 'సైయారా'కు ప్రేక్షకుల్లో ఆదరణ తగ్గలేదు. ఈ చిత్రం 15 రోజుల్లో దాదాపు రూ.284 కోట్లను రాబట్టింది. ఈ వారాంతానికి రూ.300 కోట్లు- వసూలు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. 'సైయారా' రెండో వారంలో 107.75 కోట్లను రాబట్టింది. బాలీవుడ్‌లో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రంగా నిలిచి రికార్డు సృష్టించింది. 'ది కశ్మీర్ ఫైల్స్' (రూ.108.97 కోట్లు-), 'దంగల్' (రూ.115.96 కోట్లు-), జవాన్ (రూ.125.46 కోట్లు-) చిత్రాలు 'సైయారా' కంటే ముందున్నాయి. మొదటివారంతో పోల్చుకుంటే.. రెండో వారంలో కలెక్షన్లు కాస్త తగ్గినప్పటికీ.. మూడోవారమూ విజయవంతంగా ప్రదర్శితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అజయ్‌దేవ్‌గణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2', సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్ర పోషించిన 'ధడక్ 2'కు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనే దక్కుతోంది. ఇది జులై 18న విడుదలైన 'సైయారా'కు కలిసివస్తోంది.

# కింగ్డమ్ రెండోభాగం మరింత ఆసక్తిగా ఉంటుంది
## విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు-, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్‌గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. 'కింగ్‌డమ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల్లో, ఓవర్సీస్ లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా.. అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉందని విజయ్ అన్నారు. కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు.. ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. కింగ్‌డమ్ విడుదలకు ముందు మాక్కూడా అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో.. అప్పుడు చాలా సంతోషం కలిగిందన్నారు. గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్ ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. గౌతమ్ కి ప్రతి విషయం మీద పట్టు- ఉంటుంది. హీరో పాత్ర, షాట్ కంపోజిషన్, మ్యూజిక్ ఇలా ప్రతిదాని మీద ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. కింగ్‌డమ్ కోసం ఆసక్తికర కథనం రాశాడు. ఇందులో ఏదో యాక్షన్ సన్నివేశం పెట్టాలి కదా అన్నట్టుగా ఎక్కడా పెట్టలేదు. దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉండేలా చూసుకున్నాడు. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించు కున్నాము. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుందని వివరించాడు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com